తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# జాతీయ క్రీడా పురస్కారాలకు... విశాఖకు చెందిన క్రీడాకారిణి

- భవిష్యత్తులో మరిన్ని లక్ష్యాలు సాధించి, యువతకు స్ఫూర్తినివ్వాలి
- జ్యోతి యర్రాజీకి శాప్ ఛైర్మన్ రవినాయుడు అభినందనలు



తిరుపతి క్రీడ, జనవరి 2 ప్రభాతవార్త: భారత మహిళా అథ్లెట్, విశాఖకు చెందిన క్రీడాకారిణి యర్రాజీ జ్యోతి అర్జున అవార్డుకు ఎంపికవ్వడం తెలుగువారంతా గర్వించదగ్గ విషయమని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. జాతీయ క్రీడా పురస్కారాలను ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం మన తెలుగు బిడ్డను అర్జున అవార్డుకు ఎంపిక చేయడం సంతోషదాయకమన్నారు. ఈ అవార్డు అథ్లెట్ జ్యోతికి మాత్రమే కాదు మన తెలుగువారి విజయంగా భావించాలన్నారు. క్రీడల పట్ల ఆమెకున్న అంకితభావం, పట్టుదలకు ఈ అవార్డు మంచి ప్రోత్సా హమన్నారు. అర్జున అవార్డుకు ఎంపికైన జ్యోతికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని లక్ష్యాలను సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, యువతకు స్ఫూర్తిగా నిలవాలని ఆయన కోరారు.

# బాబుగారి కోటలో 'బంగారం'

- ప్రారంభం కోసం ఎదురుచూస్తున్న చిగురుగుంట గనులు ..నిక్షిప్తమైన ముడి బంగారు నిల్వలు !! - వైఎస్సార్సీ పాలనలో ప్రకటనలకే పరిమితం .. గనులు ప్రారంభిస్తే యువతకు ఉపాధి !!

కుప్పం, జనవరి 2 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో బంగారు నిల్వలు నిక్షిప్తమైఉన్నాయి. గుడుపల్లె మండలం చిగురుగుంట, బిసానత్తం ప్రాంతాల్లోని బంగారు గనుల్లో టన్నుల కొద్దీ ముడి బంగారు నిల్వలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వం ఎప్పుడు చిగురు గుంట బంగారుగనులను ప్రారంభిస్తుందా అని స్థానికులు ఆశగా ఎదురు చూస్తున్నారు. చిగురుగుంట గనుల్లో బంగారం నిల్వలు ఉన్నాయా లేదా అనేది వెలికి తీసేందుకు ఢిల్లీకి చెందిన మైసూరు జియో సంస్థ 2011సం॥లోనే దాదాపు 400 హెక్టార్లలో శాం పుళ్లను సేకరించింది. ఢిల్లీలోని ల్యాబ్‌కు శాంపుల్ రాళ్లను పంపగా ఇక్కడి గనుల్లో బంగారం ముడి సరుకు ఉన్నట్లు నిర్ధారించారు. 2018లో కేంద్ర ప్రభుత్వం చిగురుగుంట బంగారు గనులకు సంబంధించి టెండర్లు పిలిచింది. అప్పట్లో ఆస్ట్రేలియా తదితర దేశాలకు చెందిన సంస్థలతో పాటు నేషనల్ మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ (ఎన్ఎండిసి) కూడా వేలంలో పాల్గొంది. అప్పట్లో సుమారు 500కోట్లతో వేలం దక్కించుకున్న ఎన్ఎండిసి క్షేత్రస్థాయిలో దాదాపు మరో 500కోట్లతో కార్యకలాపాల నిర్వహణకు ముందుకు వచ్చింది. అయితే ఈ ప్రక్రియ అనంతరం 2019లో రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. అయితే 2019-24 మధ్యలో చిగురుగుంట బంగారు గనులకు సంబంధించి ఒక్క అడుగూ ముందుకు పడలేదు. 2022లో అప్పటి సిఎం జగన్ మరో ఏడాదిలో బంగారు గనులు ప్రారంభిస్తామని ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు మరలా సిఎం చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో చిగురుగుంట బంగారు గనులు మరలా ప్రారంభం అవుతాయని ఈ ప్రాంత ప్రజలు, యువత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



చిగురుగుంట బంగారు గనుల ప్రాంతం ఫైల్‌ఫోటో

**చిగురుగుంట బంగారుగనుల చరిత్ర :**

గుడుపల్లె మండలంలోని బిసానత్తంలో 1968లో, చిగురుగుంటలో 1978లో ఎంఇసిఎల్ అనే సంస్థ గనుల తవ్వకాలు చేపట్టింది. ఈసంస్థ ముడి బంగారాన్ని కర్ణాటకలోని కెజిఎఫ్‌లో గల భారత్ గోల్డ్‌మైన్స్ సంస్థ (బిజిఎ ంఎల్)కు అందించేది. అనంతరం ఎంఇసిఎల్ ఆర్థిక ఇబ్బందులు దృష్ట్యా తప్పుకోగా బిజిఎంఎల్ 1982నుంచి 2001 వరకు ఇక్కడ కార్యకలాపాలు సాగించింది. అయితే ఇక్కడి గనులనుంచి నష్టాలు వస్తున్నట్లు పుకార్లు రావడంతో చిగురుగుంట గనులు మూతపడ్డాయి. దీంతో దాదాపు 23 ఏళ్లుగా చిగురుగుంట గనులు మూసుకున్నాయి. ఇక్కడి కోట్ల విలువ చేసే పరికరాలు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ కొన్ని శిథిలమయ్యాయి. ఇటీవల కొంతమంది స్క్రాప్ (తుప్పు')పేరిట ఇక్కడి ఇనుము పరికరాలను తరలించినట్లు సమాచారం. కాగా చిగురుగుంట గనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అనుమతించి గనుల ప్రాంతాన్ని ఎన్ఎండిసికి అప్పగిస్తే కార్యకలాపాలు మొదలయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. గనుల్లో కార్యకలాపాలు మొదలైతే దాదాపు 2000 వేల మందికి స్థానికంగానే ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఈ నేపథ్యంలో సిఎం చంద్రబాబు నాయుడు 23 ఏళ్లుగా మూతపడిన చిగురుగుంట గనులను ప్రారంభించి కుప్పం ప్రాంత ప్రజల జీవితాల్లో ' బంగారు వెలుగులు' తీసుకువస్తారని ప్రజలు ప్రగాఢ విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

# ఆ పదిరోజులు భక్తుల భద్రతకు ప్రాధాన్యత

-సాఫీగా వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు -కొండంత పరిశీలించిన అదనపు ఈఓ,జిల్లా ఎస్పీ





తిరుమల,జనవరి 2ప్రభాతవార్తప్రతినిధి: పవిత్రమైన పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టిటిడి అధికారులు, విజిలెన్స్, పోలీసు సిబ్బంది సమన్వయంతో దర్శనం కల్పించేలా చూస్తామని టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి తెలిపారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు, సౌకర్యాలు పూర్తిచేసినట్లు చెప్పారు. ఈనెల 10,11,12తేదీల్లో అధిక సంఖ్యలో భక్తులు రానున్నందున పూర్తిస్థాయిలో ప్రణాళికా బద్ధంగా సదుపాయాలు సిద్ధంచేశామన్నారు. ఆ రెండురోజులు దర్శనానికి విచ్చేసే వివిఐపిలకు వారికి అందించే పాసులోనే దర్శన సమయం, పార్కింగ్ ప్రాంతం, ప్రవేశనిష్క్రమణ గేట్ల వివరాలు పొందు పరచినట్లు చెప్పారు. పదిరోజులు రాంభగీచా పార్కింగ్ ప్రాంతాన్ని బయటకు మార్పుచేశామన్నారు. భక్తులు పాదరక్షలను వారి వారి గదుల్లోనే,వాహనాల్లో వదలిదర్శనానికి రావాలన్నారు. భద్రత పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సివిఎస్ఓ శ్రీధర్ తెలిపారు. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాలు, ఇతర రోజుల్లోనూ భక్తులకు అవసరమైన ఏర్పాట్లు, అదనపు సౌకర్యాల గురువారం తిరుమలలో తిరుమల డిఎస్పీ విజయశేఖర్, టిటిడి విఎస్ఓలు ఎన్టీవిరామ్‌కుమార్,అల్లం సురేంద్ర, సిఐలు విజయకుమార్, రాముడు సిబ్బందితో కలసి పరిశీలించారు.

# ముహూర్తం కుదిరింది!

-ఆరేళ్ళ హామీ నెరవేరి కార్మికులకు మరింత మెరుగ్గా వైద్యసేవలు
-ఇక వందపడకల ఆస్పత్రిగా ఇఎస్ఐ రెడీ



ప్రభాతవార్త-తిరుపతి: సుమారు 110కోట్ల రూపాయల అంచనాతో ఆరేళ్ళక్రిందట నిర్మించిన ఇఎస్ఐ ఆస్పత్రి అధునాతన భవనం ఇప్పుడు అందుబాటులోకి రానుండటం కార్మికులు శుభపరిణామంగానే భావిస్తున్నారు. ఇందుకు అవసరమైన అన్ని రకాల వైద్యసేవలను మరింత మెరుగ్గా మరింతమందికి అందించేందుకు వీలుగా 50 పడకల నుండి 100పడకల ఆస్పత్రిగా సేవలందించే అవకాశం ఏర్పడింది. ఇదీ అటు కార్మికులకేగాక ఆస్పత్రి వైద్యులకు కూడా ఒక మంచివిషయంగానే పరిగణిస్తున్నారు. సాధారణంగానే తిరుపతినగరం పేరు చెబితే నాణ్యమైన విద్యాబోధన చేసే విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలతో బాటు అత్యాధునిక వైద్యసేవలందించే ప్రముఖ కార్పొరేట్ ప్రైవేట్ ఆస్పత్రులు,ఆ తరువాత టిటిడి ఆధ్వర్యంలోని స్విమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి,ప్రభుత్వం ఆధీనంలోని రుయా ఆస్పత్రి ఎవరికైనా గుర్తుకు వస్తాయి. తిరుపతి,చిత్తూరు జిల్లాల పరిధిలోనేగాక పరిసరాల్లోని జిల్లాల్లో చివరకు తమిళనాడు సరిహద్దుల్లో తీవ్రరోడ్డు ప్రమాదాలు జరిగినా క్షతగాత్రులను వెంటనే తిరుపతి రుయా,స్విమ్స్ ఆస్పత్రులకు తరలించడం పరిపాటి. అయితే ఇందుకు భిన్నంగా మెడికల్ హబ్‌గా అభివృద్ధి చెందిన తిరుపతిలో రాష్ట్రప్రభుత్వ ఆధీనంలోని ఇఎస్ఐ ఆస్పత్రి కార్మికులు,వారి కుటుంసభ్యుల కోసం వైద్యసేవలంది స్తోంది. తిరుపతి ప్రాధాన్యత,ఇక్కడ పరిశ్రమలు ఉండటంతో 1998లోనే అప్పట్లో అధికారంలోని కేంద్రప్రభుత్వం తిరుపతి బైరాగిపట్టెడకు సమీపంలో 50 పడకల సామర్థ్యంతో ఇఎస్ఐ ఆస్పత్రిని నిర్మించి రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో సేవలందించేలా ఆదేశించింది. అప్పటినుండి రాయలసీమ జిల్లాలకేగాక నెల్లూరు జిల్లాలోని పలు ప్రైవేటు కర్మాగారాలు, పలు రకాల ప్రైవేటు సంస్థలు, ప్రభుత్వ, కార్పొరేట్ ఉద్యోగులు,వారి కుటుంబ సభ్యులు పలు రకాలుగా ఇఎస్ఐ వైద్యసేవ లందుకునే లబ్ధిదారులైన కార్మికుల సౌకర్యార్థం వైద్యసేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. అప్పటినుండి ఈ జిల్లాల్లో ఏ పరిశ్రమలో ప్రమాదాలు జరిగి కార్మికులు గాయపడినా, ఇతరత్రా అనారోగ్యం బారిన పడిన కార్మికులు,వారి కుటుంబసభ్యులకు నామమాత్రపు వైద్యసేవలందేవి. ఈ ఆస్పత్రి ప్రాధాన్యత పెరగడం, ఇంకా ఎన్నో ప్రైవేటు కంపెనీలు, ఇతరత్రా ప్రైవేటు కార్పొరేట్ సెక్టర్‌లలో పనిచేసే ఉద్యోగుల సంఖ్య రెట్టింపయింది. అత్యాధునిక వైద్య సౌకర్యాలతో, అధునాతన భవనాలను నిర్మించినా ఇప్పటికీ 50 పడకల ఆస్పత్రిగానే నిర్వహిస్తున్నారు. ఈ ఆస్పత్రి ప్రాధాన్యత పెరగడం, రోజువారీగా ఓపిలు ఎక్కువగా ఉండటంతో ఆస్పత్రిని వంద పడకలుగా సేవలందించాలని కార్మికులు విన్నవించారు. గత ఏడాది రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం, సిఎం చంద్రబాబునాయుడు సదుద్దేశ్యంతో తిరుపతి ఇఎస్ఐ ఆస్పత్రిని 100 పడకలుగా అందు బాటులోకి తీసుకువచ్చి వైద్యసేవలు అందించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. గురువారం అమరావతిలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో సిఎం చంద్రబాబు అనుమతి ఇవ్వడంతో ఇకపై సాధారణ ఓపిలేగాక పలు రకాల శస్త్రచికిత్సలు, వైద్యసేవలు మరింత మెరుగ్గా అందనున్నాయి. నైపుణ్యంఉన్న వైద్యాధికారులు అందుబాటులో ఉండనున్నారు.

# సర్టిఫికెట్ల జారీలో అవకతవకలు... రీ వెరిఫికేషన్‌కు ఆదేశాలు జారీ

- మరో సారి తప్పు జరిగితే కఠిన చర్యలు తప్పవు
- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ హెచ్చరిక



తిరుపతి కలెక్టరేట్, జనవరి 2 ప్రభాతవార్త : గత ప్రభుత్వంలో సదరం సర్టిఫికెట్ల జారీలో అవకతవకలు జరిగాయనే నేపథ్యంలో ప్రభుత్వం నుంచి అందిన మార్గదర్శకాల మేరకు రీ వెరిఫికేషన్ ప్రక్రియ సక్రమంగా చేపట్టాలని కొత్తగా ఇచ్చే సదరం సర్టిపికెట్లలలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ హెచ్చరికలు జారీ చేశారు. గురువారం సాయంత్రం సదరం సర్టిఫికెట్ల రీవెరిఫికేషన్‌పై దీర్ఘకాలిక వ్యాధులతో మంచానికే పరిమితమై 15వేల రూపాయల పెన్షన్ పొందుతున్న పేషంట్ల వివరాలపై విభిన్న ప్రతిభావంతుల పెన్షన్లను పొందుతున్న వాటిపై తనిఖీ మార్గదర్శకాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో, పీడీవెలుగు డీఎంహెచ్‌వో, డీసీహెచ్ఎస్ తదితర జిల్లా స్థాయి స్క్రీనింగ్ కమిటీ అధికారులతో వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ కృష్ణబాబు సంబంధిత కార్యదర్శులతో కలిసి వర్చువల్ విధానంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలతో అక్రమంగా పింఛన్లు పొందే వారిని తొలగించే ప్రక్రియను ప్రభుత్వం చేపట్టిందని కృష్ణబాబు తెలిపారు. ప్రతి పెన్షన్ లబ్దిదారుని ఇంటికి వెళ్ళి వారి ఆరోగ్య వివరాలను తెలుసుకుని అర్హులైన వారిని డేటాను యాప్‌లో నమోదు చేయాలన్నారు. సోమవారం నుంచి విచారణ చేపట్టాలన్నారు. రీ వెరిఫికేషన్ పకడ్బందీగా జరగాలని, కొత్త వెరిఫికేషన్‌లలో ఎటువంటి అక్రమాలు జరగరాదని, అలా జరిగితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో పథక సంచాలకులు వెలుగు శోభన్ బాబు డెప్యూటీ సీఈవో జాబేదా జిల్లా పరిషత్ డీఎంహెచ్‌వో బాలాజీ నాయక్, డీసీహెచ్ఎస్ ఆనందమూర్తి రుయా సూపరింటెండెంట్ రవి ప్రభు, జిల్లా గ్రామవార్డు సచివాలయ అధికారి నారాయణ రెడ్డి జిల్లా పంచాయతీ అధికారి సుశీలా దేవి, తదితరులు పాల్గొన్నారు.

# పెన్నేపల్లి వద్ద స్టీల్ పరిశ్రమలో... భారీ అగ్ని ప్రమాదం

- బాయిలర్లు పేలి ఎగసిన మంటలు - ఒకరు మృతి, మరో ఇద్దరి పరిస్థితి విషమం
- చికిత్స పొందుతున్న ముగ్గురు కార్మికులు - ఘటన స్థలాన్ని సందర్శించిన ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ





మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ - చాపల వెంకటేశ్వర్లు

నాయుడుపేట (పెళ్లకూరు), జనవరి 2 ప్రభాతవార్త : పెళ్లకూరు మండలం పెన్నేపల్లి గ్రామ సమీపంలో ఉన్న అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. పరిశ్రమలోని బాయిలర్లు పేలిపోవడంతో పెద్దఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ముగ్గురు కార్మికులు చికిత్సలు పొందుతున్నారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పరిశ్రమలోని కార్మికులు హాహాకారాలు చేశారు. అయితే ఈ ఘటనలో మొత్తం ఆరుగురు గాయపడ్డారు. వీరిలో సిపాయిలాల్, రవిబార్వాస్, సోను అనే కార్మికుల పరిస్థితి విషమంగా ఉండటంతో నాయుడుపేట ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్సల అనంతరం నెల్లూరుకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్సల నిమిత్తం చెన్నైకి తరలించారు. వీరిలో సిపాయిలాల్ (30) అనే కార్మికుడు చెన్నైలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. రవిబార్వాస్, సోను అనే కార్మికుల పరిస్థితి విషమంగా ఉంది. సుమారు 25 టన్నుల సామర్థ్యం ఉన్న కాలం చెల్లిన ఫర్నెస్ బాయిలర్ ప్రమాదవశాత్తు భారీ విస్ఫోటనం చెంది, దాని నుంచి పెద్దపెద్ద శబ్దాలతో మంటలు ఎగిసిపడినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఫ్యాక్టరీలో చోటు చేసుకున్న విస్ఫోటనంతో మంటలు, శబ్ధాల కారణంగా గ్రామంలోని ఇళ్లలో వస్తుసామగ్రి కింద పడిపోయి గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. నాయుడుపేట డిఎస్పీ చెంచుబాబు, సిఐ సంగమేశ్వరరావులు ఘటన స్థలాన్ని చేరుకొని పరిశీలించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలు అదుపు చేశారు. కాగా, ఘటనపై సమాచారం అందుకున్న సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ఆర్డీఓ కిరణ్మయి పరిశ్రమను సందర్శించారు. ప్రమాదంజరిగిన ప్రదేశంలో ఉన్న సీసీ ఫుటేజిలను పరిశీలించారు. పెళ్ళకూరు ఎస్సై నాగరాజు పరిశ్రమలో అగ్నిప్రమాదంపై కేసునమోదుచేసి దర్యాప్తు చేసున్నట్లు తెలిపారు. ప్రమాదంలో గాయపడి మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

**కార్మికులకు న్యాయం చేయండి:**

స్టీల్ పరిశ్రమ యాజమాన్యంపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఇండస్ట్రియల్ క్లస్టర్ కన్వీనర్ చాపల వెంకటేశ్వర్లు కోరారు. మృతిచెందిన కార్మికుడి కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. గాయపడిన కార్మికుల కుటుంబాలకు రూ.50 లక్షలు చొప్పున నష్ట పరిహారం అందించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పరిశ్రమల్లో జరుగుతున్న వరుస ప్రమాదాలపై తనిఖీలు జరిపి భద్రత ప్రమాణాలు పాటించే విధంగా సేఫ్టీ అధికారులు తక్షణం స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు.

# మందుల మాయాజాలం...సామాన్యుని సంకటం

-ప్రైవేటు డాక్టర్ల మందుల దుకాణాల నిర్వహణ -అక్కడే మందులు కొనాలి, తమ ల్యాబ్‌లోనే టెస్టులు చేసుకోవాలి



ప్రభాతవార్త-శ్రీకాళహస్తి

పుణ్యక్షేత్రంలో భక్తి భావంతో జీవించే ప్రజలకు అనారోగ్యం చేస్తే డాక్టర్ ధన దాహానికి సామాన్యుని జేబులు ఖాళీ అవుతున్నాయి. ఓ వైపు నాడిపట్టి చూడని నిపుణులైన డాక్టర్ల వద్దకు వెళ్ళి సామాన్యుని కంట నీరొలుకుతుంది. శ్రీకాళహస్తిలో సుమారు 40మంది అర్హత ఉన్న డాక్టర్లు మరో 30మంది ఆర్ఎంపి డాక్టర్లున్నారు. వీరిలో చాలా మంది డాక్టర్లు సొంతంగా మందుల దుకాణాలు నిర్వహిస్తూ సామాన్యుని కంటనీరొలికిస్తున్నారు. ప్రైవేటు డాక్టర్లు సొంతగా మందుల దుకాణాలు ఏర్పాటు చేసుకుని, వారే దుకాణంలో ఫార్మసిస్టులను నియమించుకుంటారు. కనీసం పదవ తరగతి కూడా చదవని యువతీ యువకులను దుకాణాల్లో నియమించి, డాక్టర్ల రాత ఒక్క దుకాణంలో పని చేసే వారికే అర్థమౌతుంది. శ్రీకాళహస్తిలో 40 మంది లీడింగ్ డాక్టర్లుండగా 14 మంది సొంతంగా క్లీనిక్‌లు, మందుల దుకాణాలు నిర్వహించుకుంటున్నారు. ఈ దుకాణాల్లోనే డాక్టర్లు రాసిన మందులు కొనాలి. ఎవరైనా పొరబాటున బయటి దుకాణాల్లో మందులు కొనుగోలు చేస్తే డాక్టర్లు ససేమిరా అంటారు.

**ఒక రోగానికి ... రక రకాల మందులు:**

శ్రీకాళహస్తిలోని ప్రైవేటు డాక్టర్ల తీరు ఆగమ్యగోచరంగా మారుతుంది. జ్వరం, దగ్గు, జలుబు అని వెళితే ఇక నెల రోజులు డాక్టర్ల వద్దకు తిరగాల్సిందే. మొదటి రోజు డాక్టర్లు, ఏడెమిది రకాల మందులు, సిరప్‌లు, నెబులైజర్‌ను అందులో మందులు, ముక్కులో చుక్కలు ఇలా రాస్తున్నారు. ఈ మందుల జాబితాతో డాక్టర్ మందుల షాపుల్లో వెళితే రోగికి ముచ్చెమటలు పడుతున్నాయి. కనీసం వెయ్యికి తగ్గకుండా బిల్ అవుతుంది. ఇదే మందులను బయటి మార్కెట్‌లో కొనుగోలు చేస్తే సగం బిల్లు కూడా కాదు. అదే కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జనరిక్ మందుల షాపు, దావాఇండియాలో 25శాతం మాత్రమే అవుతుంది. కానీ బయటి నుంచి తెచ్చిన మందులను డాక్టర్లు అంగీకరించరు. శ్రీకాళహస్తిలోని ఒకరిద్దరు డాక్టర్లు మినహా మిగిలిన వారందరూ తమ క్లీనికల్‌లోనే మందుల దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. కొందరు డాక్టర్లు అయితే ఒక సారి ప్రమాదకరమైన 'స్టెరాయిడ్స్' వాడుతూ, భవిష్యత్తులో కొత్త సమస్యలు తలెత్తె ప్రమాదం చోటు చేసుకోనున్నది. రోగికి రోగం పరిస్థితి ఎలా ఉన్నా యాంటి బయాటిక్స్‌తో నీరసించి పోతున్నారు. ఇలా శ్రీకాళహస్తిలోని డాక్టర్లు క్లీనిక్‌లు, మందుల దుకాణాలు ఏర్పాటు చేసుకొని దొరికినోళ్ళకు దోరికి నంత దోచుకో అంటూ విచ్చల విడి వ్యాపారం సాగిస్తున్నారు. ఇక ప్రభుత్వం శ్రీకాళహస్తిలో సుమారు 11 ఎకరాల స్థలంలో వంద పడకల ఆసుపత్రిని నిర్మించారు. ఇక్కడ డాక్టర్లు కేవలం పేరుకు మాత్రమే పని చేస్తారు. ఉన్నతాధికారి నుంచి ప్రతి ఒక్క డాక్టర్ పట్టణంలో క్లీనిక్‌లు నిర్వహించుకుంటారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఒకే వ్యాధికి సంబంధించి చూసే డాక్టర్, బయట మాత్రం ఆల్‌రౌండర్. ప్రభుత్వ ఆసుపత్రిలో ఆపరేషన్లు చేయరు, కానీ తమ క్లీనిక్స్‌లో మాత్రం ఎంచక్కా ఆపరేషన్లు చేస్తూ, నిరుపేదల నుంచి వేల రూపాయలు బిల్లులు వసూలు చేసుకుంటు న్నారు. కాసుల పంటే ఇలా మందుల మాయాజాలంతో సామాన్యుని జీవితంతో చెలగాట మాడుతూ తమ బ్యాంకు ఖాతాల్లో బాలెన్సులు పెంచుకుంటున్నారు.

# అక్కడ వారిదే రాజ్యం!

-ధృవ పత్రం చేతికి అందాలి అంటే...చెయ్యా తడపాల్సిందే
-యస్.వి.యు పరీక్షా విభాగంలో అవినీతి -ప్రక్షాళన దిశగా అధికారులు అడుగులు

తిరుపతి విద్య, జనవరి 2 ప్రభాతవార్త : ఎస్వీయులో అవినీతి రోజు రోజుకూ శృతి మించుతోంది, దీంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. వర్సిటీలో ఎంతో మంది ఉద్యోగులు ఉన్నత లక్ష్యంతో వర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. కానీ మరికొందరు తమ స్వార్థం కోసం వర్సిటీకి మచ్చ తెచ్చే విధంగా నడుచుకోవడం విమర్శలకు దారితీస్తుంది. ప్రధాన విభాగాలలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు కలెక్షన్‌లో కింగ్‌లుగా వ్యవహరిస్తూ విద్యార్థుల నుంచి వేలకు వేలు వసూళ్లు చేస్తూ, జీతాలతో పనిలేకుండా కోట్లకు పడగలెత్తారని వర్సిటీలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

**-అక్కడ ప్రతి పోస్టుకి డిమాండ్ ఎక్కువ**

ఎగ్జామినేషన్ సెక్షన్‌లో ప్రతి పోస్టుకి డిమాండ్ ఎక్కువ. ఆ విభాగంలో పోస్టింగ్ కోసం అధికార పార్టీకి చెందిన స్థానిక నేతలతో పాటు ఎమ్మెల్యే, మంత్రి స్థాయి వరకు పైరవీలు నడుపుతుంటారనే విమర్శలు వున్నాయి. అధికారులపై ఒత్తిడి తెచ్చేందుకు శక్తికి మించి ప్రయత్నాలను చేయడం పరిపాటిగా మారిందన్నారు. పోస్టింగ్ కోసం వెయ్యికి మించి ప్రజా ప్రతినిధుల సిఫార్సు లెటర్లు అధికారులకు చేరాయంటే, ఒత్తిడి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రతి ధృవపత్రానికి వేలల్లో విద్యార్థుల నుంచి వసూళ్లు చేసి దండుకోవడమే లక్ష్యంగా ఆ విభాగంలో కొంతమంది సిబ్బంది విధులు నిర్వహించడం గమనార్హం

**- అవసరాన్ని బట్టి రేటు!:**

డిగ్రీ,పీజీ పూర్తి చేసిన విద్యార్థులు కాన్వకేషన్ కోసం, ప్రొవిజినల్ సర్టిపికేట్ల కోసం వర్సిటీ చుట్టూ తిరుగుతుంటారు. ఇదే కొందరి సిబ్బందికి సిరుల సంపదగా మారి, ప్రధానంగా సుదూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులను టార్గెట్ చేస్తారని సమాచారం. వారికి ధృవపత్రం అవసర తీవ్రతను పసిగట్టి వారంలోపు ఇవ్వాలంటే ఒకరేటు,మూడు రోజులో ఇవ్వాలంటే మరో రేటు నిర్ణయించి ముక్కుపిండి వసూళ్లు చేస్తున్నారి విద్యార్థులు వాపోతున్నారు. వర్సిటీలోని పరపాలనా భవనంలో ధృవపత్రాల కోసం ధరఖాస్తు చేసుకునేందుకు వెళ్లినా ఇదే తంతు దర్శనమిస్తుదని, అక్కడ బేరసారాలు జరిగిన తర్వాతా ఎగ్జామినేషన్ సెక్షన్ లో మిగిలిన ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఒక్కో సర్టిఫికేట్‌కు రూ.5వేల నుంచి రూ.10వేలకు పైగా వసూళ్లు చేస్తున్నారంటే నమ్మలేని నిజమని అక్కడ పనిచేస్తున్న తోటి ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. రోజుకు కనీసం పదివేలు ఆదాయం లేనిదే సీటు నుంచి కొంతమంది సిబ్బంది కదిలే పరిస్థితి ఉండదని ఏకంగా ఎగ్జామినేషన్ సెక్షన్లో పనిచేసే సిన్సియర్ ఉద్యోగులు కొందరు చెబుతుండటం ఆశ్చర్యకరం.

**-త్వరలో విద్యార్థుల చెంతకే సర్టిపికేట్స్:**

రాబంధులకు అధికారులు చెక్ పెట్టేందుకే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. త్వరలో ఆన్లైన్ విధానం అమలులోకి తీసుకోచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు వర్సిటీలో ప్రక్రియ ప్రారంభమైందని, కొందరు ఉద్యోగులు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసి దోచుకోవడానికి అడ్డుకట్ట వేసేందుకు ఆన్లైన్ విధానం అమలు కాబోతోంది. ధృవపత్రాలకోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆన్లైన్లోనే అందించే ప్రక్రియకువర్సిటీ శ్రీకారం చుట్టనుంది. ఈ ఏడాదిలోనే ఈ ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు అధికారులు తెలిపారు.

**ప్రక్షాళణ ప్రారంభించాం....త్వరలో అడ్డుకట్ట వేస్తాం**
**- ప్రొఫెసర్ భూపతినాయుడు, రిజిస్ట్రార్, ఎస్వీయూ**



ఎస్వీయూ పేరు ప్రతిష్టలను దెబ్బతీసే విధంగా ప్రయత్నిస్తున్న కొందరు ఉద్యోగుల వికృత చేష్టలకు త్వరలోనే అడ్డుకట్ట వేస్తాం అని రిజిస్ట్రాన్ తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోబోతున్నామని, ప్రతి ధృవపత్రాన్ని డిజిలాకర్లో ఉంచేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ మేరకు ప్రక్రియ ప్రాంభించేదుకు, అవసర మైన సర్టిఫికేట్‌ను విద్యార్థి చెంతకు ఆన్లైన్ ద్వారా అందించనున్నామని తెలిపారు. కొందరు అధికారులపై ఒత్తిడి తెచ్చినా పట్టించుకోకుండా వర్సిటీ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్లుతున్నామని వివరించారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

**రేణిగుంట, జనవరి 2 ప్రభాతవార్త:** రేణిగుంట మండలం మల్లవరం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ మేరకు గురువారం రేణిగుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. స్టేషన్ రైటర్ గౌరీనాయుడు ఇచ్చిన సమాచారం మేరకు...శ్రీకాళహస్తి మండలం ఎన్‌టీఆర్ కాలనీకిచెందిన భగవాన్, తన ద్విచక్ర వాహనంపై భార్య శ్రావణి రెండు సంవత్సరాల కుమార్తె హేమశ్రీతో కలసి కపిలతీర్థం వెళ్ళడానికి బయలుదేరారు. వీరి వాహనం మల్లవరం సమీపిస్తుండగా గుర్తు తెలియని కారు వేగంగా ద్విచక్ర వాహనాన్ని వెనుక ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంలో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన బ్లూ కోట్ పోలీసులు వీరిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. కుమార్తె హేమశ్రీని మెరుగైన వైద్యం కోసం తండ్రి భగవాన్, ఆమెను నారాయణాద్రి ఆస్పత్రిలో చేర్చారు. బాధితుని ఫిర్యాదు మేరకు అర్బన్ సీఐ శరత్‌చంద్ర ఆదేశాలతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బిల్లుల గోల్‌మాల్‌పై గ్రామసభలో రచ్చ



**రేణిగుంట, జనవరి 2 ప్రభాతవార్త:** రేణిగుంట పంచాయతీ కార్యాలయంలో గురువారం సర్పంచ్ నాగేషం అధ్యక్షతన జరిగిన గ్రామసభ రచ్చ రచ్చగా సాగింది. గ్రామసభలో పాల్గొన్న వివిధ పార్టీల నేతలు బిల్లుల గోల్‌మాల్‌పై అధికారులను నిలదీశారు. తెలుగు గంగ పైపులైన్ మరమ్మతుల కోసం పెట్టిన సుమారు 6 లక్షలు బిల్లు ఫేక్ బిల్లులని ఆరోపించారు. అనేక బిల్లుల్లో అవకతవకలు జరిగాయని ధ్వజమెత్తారు. బిల్లుల విషయంలో నీకు తేల్చాలని ప్రశ్నించారు.పాంచాలి నగర్‌లో పంచాయతీ నిబంధనలను అతిక్రమించి పంపు షెడ్డునఉ ఆక్రమించి బిల్డింగ్ కట్టడాన్ని ప్రశ్నించారు. రోడ్లు, పారిశుధ్యం తదితర అనేక అంశాలు గ్రామసభలో చర్చకు వచ్చాయి. ఐఎఫ్‌ఎస్‌ఎం పేరుతో రేణిగుంట పట్టణలో కొంత మంది వ్యక్తులు తనిఖీ నిర్వహిస్తున్న నేపథ్యంలో స్థానికులు వారిని కొన్ని రోజుల క్రితం పంచాయతీ కార్యాలయానికి అప్పగించిన విషయాన్ని గ్రామసభ దృష్టికి తెచ్చారు. పంచాయతీ కార్యాలయంలో ఓ ప్రైవేటు వ్యక్తి తిరగడాన్ని అడిగారు. గ్రామసభలో వార్డు మెంబర్లు ఎం.జి.రెడ్డి, రమణ, జనసేన నాయకురాలు భాగ్యలక్ష్మి, రేణిగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వి.ఆర్.రావణన్, సీపీఎం పార్టీ నేతలు ఓ.వి.రమణ, సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల అభివృద్ధికి అందరూ సహకరించాలి:ఎంఈవో



**రేణిగుంట, జనవరి 2 ప్రభాతవార్త:** పాఠశాలల అభివృద్ధికి అందరూ సహకరించాలని ఎంఈవో ఇందిరాదేవి పిలుపునిచ్చారు. రేణిగుంట మండల స్థాయి పాఠశాలల యాజమాన్యాల కమిటీలతో స్థానిక జిల్లా పరిషత్ బాలుర ప్లస్ టు ఉన్నత పాఠశాలలో గురువారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంఈవో మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్ పట్ల బాధ్యతతో వ్యవమరించా లన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణను నేర్పాలన్నారు. సమావేశంలో ఎంఈవో-2 రంగనాథ్, రిసోర్స్ పర్సన్స్ ప్రసాద్, నరసింహులు, శ్రీపతి, సునీతగౌడ్, నీలకంఠయ్య తదితరులతో పాటు 66 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, 66 పాఠశాలల విద్యా కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

## అక్రమంగా స్క్రాప్ తరలింపు దారుణం



**తిరుపతి విద్య జనవరి 2 ప్రభాతవార్త:** ఎస్వీయూలో లక్షలు విలువ చేసే స్క్రాప్ ను బహిరంగ టెండర్లు, పత్రికా ప్రకటనలు లేకుండా నిబంధనలు పాటించ కుండా విక్రయించడం దారుణమని భారతీయ దళిత విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షులు కొండా యుగంధర్, ఏపీ విద్యార్థి హక్కుల సంఘం నేత రుకేష్ డిమాండు చేశారు. గురువారం వారు మీడియాతో మాట్లాడుతూ వర్సిటీ అధికా రులు లోపాయికారి ఒప్పందంతో వర్సిటీ లక్షలు విలువ చేసే స్క్రాప్ ను నిబంధనలకు విరుద్ధంగా తమ అనుకూల వ్యక్తులకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. వెంటనే ప్రక్రియను నిలిపివేసి బహిరంగ టెండర్లతో అందరి సమక్షంలో ప్రక్రియ కొనసాగాలని డిమాండు చేశారు.

## నేడు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన : డివైఈవో



**తొట్టంబేడు, జనవరి 2 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తిలోని ఆర్‌పిబిఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నేడు నిర్వహించనున్న జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని డివైఈవో ప్రభాకర్‌రాజు అన్నారు. గురువారం ఆయన ప్రధానోపాధ్యాయులు, పిడిలు, ఉపాధ్యా యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన వ్యక్తిగత గ్రూప్ ఉపాధ్యాయ విభాగాల కింద ప్రతి మండలం నుంచి 3 ఎగ్జిబిట్లు జిల్లా ప్రదర్శనలో ఉంచాలన్నారు. ముందుగా ఏర్పాటు చేసిన కమిటీలు వారికి కేటాయించిన పనులను పూర్తిచేసేందుకు ముందస్తుగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎంఈవో బాలయ్య మాట్లాడుతూ తిరుపతి జిల్లా నుంచి 34 మండలాల నుంచి 102 ప్రాజెక్టులను జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రదర్శిస్తారన్నారు.దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శన పుదుచ్చేరిలో ఈనెల 21వ తేదీ నుంచి 25వతేదీ వరకు నిర్వహించబడుతుందన్నారు. సమావేశంలో జిల్లా సైన్సు అధికారి భాను ప్రసాద్, ఎంఈఓలు భువనేశ్వరి, బాలయ్య, ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## డిఎంఅండ్‌హెచ్‌ఓను కలసిన శ్రీకాళహస్తి వైద్యులు



**శ్రీకాళహస్తి, జనవరి 2 ప్రభాతవార్త :** డిఎం అండ్ హెచ్‌ఓ బాలకృష్ణనాయక్‌ను శ్రీకాళహస్తి పట్టణంలోని ఏపిజిఎంపిడబ్యుఏ జిల్లా కార్యదర్శి ఏడుకొండలు ఆధ్వర్యంలో తిరుపతిలో పదవీబాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన్ను దుశ్శాలువతో సత్కరించి శ్రీకాళహస్తీశ్వరుని తీర్థప్రసాదాలు అందించారు. అనం తరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారి సమస్యలు గురించి తెలిపారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి కార్యక్రమంలో అసోసియేషన్ లీడర్లు ఎం.మోహన్, ఎం.శివశంకర్, సి.రామ్మూర్తి, జి.వీరయ్య, తిరుపతి నాయకులు జె.కుమార్, గురుస్వామి, ముని ప్రకాష్, ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి పరామర్శ



**శ్రీకాళహస్తి, జనవరి 2 ప్రభాతవార్త :** పదోవార్డు కైకాల వీధిలో నివాసం ఉంటున్న తెలుగుదేశంపార్టీ రాష్ట్ర మైనార్టీ కార్యనిర్వహణ కార్యదర్శి షాకీరాలీ అత్త స్వర్గస్తులయ్యారు. విషయం తెలుసుకున్న ఎంఎల్‌ఏ బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జలబృందమ్మ సంతాపం ప్రకటించారు. వారి కుటుంబసభ్యుల్ని ఓదార్చారు. బృందమ్మతోపాటు నాయకులు సిఎస్.మస్తాన్, షఫి, ఖాదర్‌బాషా, జిలానీ, అస్మత్, కరీం, జావిద్, మీర్జా, నయిమ్, అల్లాబక్ష్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి నుంచి ప్రత్యేక బస్సులు

**తొట్టంబేడు, జనవరి 2 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తి ఆర్టీసి బస్టాండు నుంచి భవానీ దీక్ష తీసుకున్న భక్తులకు విజయవాడ, మరియు మేల్‌మరుమత్తూరుకు ప్యాకేజీగా ధనుర్మాసం సందర్భంగా బస్సులు అద్దె ప్రాతిపదికన ఇవ్వనున్నట్లు డిపో మేనేజర్ బాలాజీ తెలిపారు. భక్తులు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.

## మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సత్కారం



**శ్రీకాళహస్తి, జనవరి 2 ప్రభాతవార్త :** తిరుపతి పార్లమెంటు అధికార ప్రతినిధి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడును పట్టణ తెలుగుయువత ఉపాధ్యక్షులు వంకాయల సిద్దులయ్య రంగినేని చెంచయ్య నాయుడును దుశ్శాలువ, పూలమాలతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎర్రమ్మరెడ్డిపల్లి నీటి సంఘం అధ్యక్షులు చెంగయ్య, తెలుగుయువత నాయకుడు నవీన్ రైతు నాయకులు అశ్వద్ధామపాల్గొన్నారు.

## కెరీర్ అడ్వాన్స్ మెంట్‌పై అవగాహన సదస్సు

**తిరుపతి విద్య, జనవరి 2 ప్రభాతవార్త :** ఎస్ జి ఎస్ ఆర్ట్స్ కళాశాలలో మైక్రో బయోలజీ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ అడ్వాన్స్మెంట్ ఆన్ మెక్రో బయోలజీ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథులుగా మైక్రోబయోలజీ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ ప్రొఫెసర్ అరవింద్ దేశ్ ముఖ్, ఏపీ ఏంబీఎస్ఐ ఏపీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ నరసింహ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు బయోపెస్టిసైడ్స్, బయోఫర్టిలైజర్స్, ప్రొబయోటిక్స్, బయోఇన్ఫోమ్యాటిక్స్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించి ప్రతిభ కనబరచిన వారికి ప్రశంసాపత్రాలను, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ పరమేశ్వర్, హెచ్‌డీ వి వెంకటలక్ష్మీ, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు శ్రీకాళహస్తిలో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన



**శ్రీకాళహస్తి,జనవరి 2 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తిలో శుక్రవారం ఉదయం జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ ప్రారంభించనున్నారు. విద్యా,క్రీడారంగాల్లో శ్రీకాళహస్తికి చెందిన విద్యార్థులు తమ సత్తాను చాటుతున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు తెస్తున్నారు.ఈ నేపధ్యంలో ఈ ఏడాది ప్రారంభంలో జిల్లా స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనను శ్రీకాళహస్తిలో నిర్వహించుటకు అనుమతించటంతో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లను మండల విద్యాశాఖాధికారి భువనేశ్వరి పర్యవేక్షిస్తున్నారు. గురువారం ఆమె ప్రభాతవార్తతో మాట్లాడుతూ ఇటీవల జిల్లాలోని 34 మండలాల్లో మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించినట్లు వివరించారు. అక్కడ మూడు అంశాలను ఎంపిక చేసినట్లు వివరించారు.ఈ మూడు ప్రదర్శనలను శుక్రవారం ప్రదర్శించనున్నట్లు ఆమె వివరించారు. ఇక్కడ ఎంపికైన ప్రదర్శనలను త్వరలో జరగబోవు రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి భాను ప్రసాద్ పర్యవేక్షణలో సదస్సు జరగనున్నట్లు ఆమె వివరించారు.

## పాఠశాల యాజమాన్య కమిటిలకు శిక్షణ



**నింద్ర,జనవరి 2 ప్రభాతవార్త :** గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర సమగ్ర శిక్ష అబియాన్ ఆద్వర్యంలో విద్యాశాఖా తరపున పాఠశాల యాజమాన్య కమిటి సభ్యులకు శిక్షణలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు,యస్‌యంసి చైర్‌పర్సన్‌లకు మండల స్థాయిలోఒక్కరోజు శిక్షణ కార్యక్రమం మండల విద్యాశాఖాధికారులు వసుమతిదేవి అధ్యక్షతన శ్రీధర్‌రాజు ఆద్వర్యంలో నిర్వహించినారు. రిసోర్స్ పర్సన్‌లు అపరంజిరాజు, కుప్పయ్య, బాలబ్రహ్మానందం, బాలాజీ, వెంకటేశులు, పళని తదితరులు పాల్గొన్నారు.

## హిమజ డిగ్రీ కాలేజీలో స్కిల్ కోర్స్

**పుత్తూరు, జనవరి 2 ప్రభాతవార్త :** పట్టణంలోని హిమజ డిగ్రీ కాలేజీలో కమ్యూనికేషన్, ఎంప్లాయిబిలిటీ తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎన్.లోకనాథం మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ వరకూ కొనసాగే కమ్యూనికేషన్ స్కిల్స్ తరగతుల వల్ల విద్యార్థులు అకడమిక్ ప్రతిభతో పాటు కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు సంపాదించే నైపుణ్యం పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో నాంది ఫౌండేషన్ శరత్‌బాబు, కాలేజీ వైస్ ప్రిన్సిపల్ ఆర్.పురుషోత్తమరాజు, సమన్వయకర్త షేక్ అఫ్రిన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవాలి

**కేవీబీపురం, జనవరి 2 ప్రభాతవార్త:** మండలంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు విధాన్‌సే సమాధాన్ అవగాహన సదస్సు కార్యక్రమంలో భాగంగా జాతీయ మహిళా కమిషన్, భారత న్యాయ సేవాధికార సంస్థ శ్రీకాళహస్తి మండల న్యాయసేవా సంఘం ఆధ్వర్యంలో ఉచిత మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు కేవీబీపురం మండలంలో నిర్వహించారు. ఎంపీడీవో రాధారాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉచిత మహిళా న్యాయ విజ్ఞాన సదస్సులో శ్రీకాళహస్తి న్యాయస్థానం న్యాయవాదులు వెలుగు సంఘం ఏపీఎం చంద్రకళలు పాల్గొన్నారు. న్యాయవాదులతో పాటు అధికారులు ప్రజలకు మహిళలకు అవగాహన కల్పించారు. మహిళలు ఎదుర్కొనే ఎలాంటి సమస్యలనైనా ఉచితంగా న్యాయస్థానాల ద్వారా న్యాయం పొందుటకు జాతీయ ఉచిత న్యాయసేవలు హెల్ప్‌లైన్ నంబరు 15100ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.సమావేశంలో కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు రమేష్, ప్రభాకర్, సంఘ మిత్రలు, మహిళా గ్రూప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వగత్తూరు చెరువుకు గండి

**కేవీబీపురం, జనవరి 2 ప్రభాతవార్త:** కేవీబీ పురం మండలంలోని వగత్తూరు చెరువుకు గండి పడింది. వెంటనే స్పందించిన ఇరిగేషన్ అధికారులు గండి పూడ్చి పనిలో పడ్డారు. జేసీబీ, ట్రాక్టర్ల సహాయంతో మట్టి తోలి గండిని పూడ్చి వేశారు. అధికారులు వెంటనే స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని తెలిపారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారి బాబుకు రైతులు ధన్యవాదాలు తెలిపారు.

## విద్యుత్ షాక్‌కు రైతు మృతి!



**కేవీబీ పురం, జనవరి 2 ప్రభాతవార్త:** పొలానికి నీరు కట్టే క్రమంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కి గురై రైతు మృతి చెందిన సంఘటన కేవీబీ పురం మండలం, పెరిందేశం గ్రామంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా... పెరిందేశం గ్రామానికి చెందిన సుంకరబత్తెయ్య(35) అనే రైతు తన పొలానికి సాయంత్రం సమయంలో నీరు కట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో స్టార్టర్‌కి ఉన్న విద్యుత్ ఫీజు ఊడిపోవడంతో దానిని సరి చేసే ప్రయత్నంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌కి గురై పొలంలోనే కుప్పకూలాడు. గమనించిన తోటి రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందాడు. మృతుడు తెలుగుదేశం పార్టీకి తొలి నుంచి వీరాభిమాని కావడంతోపార్టీ నేతలు సంతాపం వ్యక్తం చేశారు. మృతుడికి భార్య అరుణ, పిల్లలు మేఘన, అఖిల్‌యాదవ్‌లు ఉన్నారు. మృతి చెందిన రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ నాయకులు

**కేవీబీపురం, జనవరి 2 ప్రభాతవార్త:** కేవీబీ పురం మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంను కలసి ఘనంగా సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుబ్రహ్మణ్యం, నియోజకవర్గ యువ నాయకుడు పాలమంగళం రమేష్, అయ్యప్ప, దూర్వాసులు తదితరులు ఉన్నారు.

## రెవెన్యూ సదస్సులో విన్నతులు వెల్లువ

**సత్యవేడు, జనవరి 2 ప్రభాతవార్త:** సత్యవేడు మండలం బాలకృష్ణాపురం మడుగు వద్ద వంతెనను నిర్మించాలని గ్రామ సర్పంచ్ ఇంధుమతి అధికారులకు విన్నవించారు. గురువారం బాలకృష్ణాపురం ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో తహసీల్దార్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఇన్‌చార్జి ఆర్ఐ సురేష్ పర్యవేక్షణలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ నేపథ్యంలో పలు సమస్యలపై ప్రజల నుంచి అధికారుల బృందం వినతులను స్వీకరించింది. వర్షాలు పడినప్పుడు బాల కృష్ణాపురం మడుగు వద్ద దాటి రైతులు పొలాల వద్దకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇక్కడ వంతెనను నిర్మించి రైతుల కష్టాలను తొలగించాలని ఇది వరకే ఎన్నో పర్యాయాలు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిం దన్నారు. అందువల్ల రెవెన్యూ సదస్సుల్లోనైనా వంతెనను నిర్మించడానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని అధికారులకు వినతి సమర్పించారు. అలాగే ఖాదర్ వేడు మడుగు వద్ద కూడా వంతెనను నిర్మించాల్సి ఉందన్నారు. సర్వే నెం.113 ఏ,115/1ఏలోని ఒక ఎకరా 17సెంట్లు భూమికి సంబంధించి పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని రైతు రమేష్ వినతి సమర్పించారు. కార్యక్రమంలో వీఆర్‌వో మోహన్‌రాజ్, పంచాయతీ సెక్రటరీ సునీల్‌కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సందీప్, వెల్ఫేర్ అసిస్టెంట్ నితిన్, డిజిటల్ అసిస్టెంట్ మణికంఠ, సర్వేయర్ గిరి తదితరులు పాల్గొన్నారు.

## రైలు దిగుతూ బాలాజీ మృతి



**సత్యవేడు, జనవరి 2 ప్రభాతవార్త:** సత్యవేడు పట్టణం ఆర్టీసీ గ్యారేజీ రోడ్డులో నివసిస్తున్న మాణిక్యంశెట్టి(ఎర్రచెట్టి) కుమారుడు బాలాజీ(46)రైలు నుంచి కిందకు దిగుతూ ఇరుక్కుపోవడంతో మృతి చెందాడు. ఈ రైలు ప్రమాదం తమిళనాడు కవర్‌పేట రైల్వేస్టేషన్ వద్ద గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా... తమ కుమార్తె చదువుల కోసం బాలాజీ విజయవాడకు వెళ్లారు. పనులు పూర్తి చేసుకుని విజయవాడలో బుధవారం రాత్రి చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. ఈ నేపథ్యంలో కవర్‌పేట వద్ద రైలు వేగం తగ్గడంతో బాలాజీ ప్లాట్‌ఫాంపైకి దిగుతుండగా కిందకు కాలు జారడంతో కదులుతున్న రైలుకు ఇరుక్కుపోయి అక్కడికక్కడే బాలాజీ మృతి చెందాడు. కాగా సత్యవేడు పట్టణం గాంధీ విగ్రహం ఎదురుగా మృతి చెందిన బాలాజీ స్టోర్ నడుపుతున్నారు. వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## ఇలాగుంటే రోగాలు రావాల మరీ...

**విజయపురం, జనవరి 2 ప్రభాతవార్త:** మండలంలోని ఇళ్లత్తూరులో పారిశుధ్యం పడకేసింది. కనకమ్మసత్రం-చివ్వాడ రోడ్డులో చెత్తాచదారం ఒకే ప్రాంతంలో పోగు చేయడం వలన అవి కుల్లిపోయి దోమలను వృద్ధి చేస్తున్నాయని, తద్వారా రోగాలు ప్రబలుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇంటి చుట్టూ మురుగు నీరు వీధుల్లో ప్రవహించడం వలన దుర్వాసన వెదజల్లుతుందని ఈ విషయమై అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు. పంచాయతీలో పారిశుధ్యం మెరుగు పరచాలని ఎంపీడీవో మొదలుకుని జిల్లా పంచాయతీ అధికారుల వరకు సూచనలు ఇస్తున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

## విధులకు డుమ్మా కొడుతున్న సచివాలయ ఉద్యోగులు



**విజయపురం, జనవరి 2 ప్రభాతవార్త:** సచివాలయ సిబ్బంది విధులకు డుమ్మా కొట్టి ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారని ఎంపీడీవో రమణప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని శ్రీహరిపురం సచివాలయాన్ని సాయంత్రం 4.30 గంటలకు ఆకస్మిక తనిఖీ చేస్తే అప్పటికే తాళం వేసి ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో సమయ పాలన పాటించాలని పలుమార్లు హెచ్చరించినా ప్రవర్తనలో మార్పు రావడం లేదని ధ్వజమెత్తారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా పంచాయతీల అభివృద్ధికి సీఎం, డిప్యూటీ సీఎం కృషి చేస్తుంటే సచివాలయ సిబ్బంది ప్రభుత్వ లక్ష్యాలను పట్టించుకోవడం లేదన్నారు. ఇకపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

# తిరుపతి డివిజన్

## పాఠశాల కమిటీ చైర్మన్లకు శిక్షణా కార్యక్రమం



**పాకాల, జనవరి 2, ప్రభాతవార్త.** పాకాల స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు మండలంలోని 69 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు గురువారం స్కూల్ కమిటీ చైర్మన్లకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాబ్జి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో కమిటీ పాత్ర చాలా ఉందని పేర్కొన్నారు. ప్రతి రోజూ విద్యార్థులు పాఠశాలకు తప్పనిసరిగా వచ్చేటట్లు చూడాలని పేర్కొన్నారు.పాఠశాలలో అమలౌతున్న వివిధ ప్రభుత్వ పథకాలు కూడా ఎలా అమలౌతున్నాయో గమనించాలని కమిటీ మెంబర్లను కోరారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ఎలా జరుగుతున్నదని చూడాలని వారిని కోరారు.కార్యక్రమంలో యమ్.ఈ.ఓ. బాబ్జి,లింగయ్య, తదితరులు పాల్గొన్నారు

## అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించండి

- డాక్టర్ బాలకృష్ణ నాయక్ పిలుపు



**తిరుపతి హెల్త్, జనవరి 2 ప్రభాతవార్త :** తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధి కారి డాక్టర్ బాల కృష్ణ నాయక్‌ని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న జిల్లా డిప్యూటి మాస్ మీడియా అధికారులు భానుమూర్తి, కిరణ్ కమార్ లు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియ జేస్తూ మర్యాద పూర్వకంగా గురువారం కలిసారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బాలకృష్ణ నాయక్ మలేరియా, డెంగ్యు, టైఫాయిడ్ వంటి అంటు వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మాతా శిశు సంరక్షణ పై ప్రజలలో అవగాహన పెంచాలని వారికి తెలియజేసారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలకు అంటువ్యాధులు కలగకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

## మామిడి పూతదశ సస్యరక్షణపై శిక్షణ



**చంద్రగిరి, జనవరి 2 ప్రభాతవార్త:** మామిడి సాగు పూతదశలో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలపై జిల్లా ఉద్యావన అధికారి దశరధరామిరెడ్డి ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని భీమవరంలో గురువారం ఆయన మాట్లాడుతూ మామిడితోటలు ప్రస్తుతం పూమొగ్గ దశ, పచ్చిపూత దశలో వున్నట్లు తెలిపారు. అదేవిధంగా మరికొన్ని తోటలు పూతవచ్చే దశలో వున్నట్లు తెలిపారు. తోటల దశలను గమనించి సరైన పురుగు, తెగులు మందులను పిచికారి చేయాలన్నారు. ఏ.రంగంపేట, కందులవారిపల్లి, చిన్నరామాపురం రైతులు ఏకమై సంఘాన్ని స్థాపించుకున్నట్లయితే ప్రభుత్వం నుండి లభించే సదుపాయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యానవన అధికారి ఎస్.శైలజ, గ్రామ వ్యసాయ సహాయకురాలు సుహాసిని, రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు



**చంద్రగిరి, జనవరి 2 ప్రభాతవార్త:** శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో గురువారం స్వామివారి జన్మ నక్షత్రం శ్రవణ నక్షత్రంను పురస్కరించుకుని శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఇందులో భాగంగాసాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవమూర్తులు విశేష అలంకృతులై తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపినాద్, సూపరింటెండెట్ వల్లంశెట్టి రమేష్‌బాబు,టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ద్వారక మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు దీవి మురళికృష్ణమాచార్య, ఆలయ సిబ్బంది గోపాల భట్టాచార్య, సంతాన కృష్ణన్, డాక్టర్ ఇల్లందు లక్ష్మి రాజేష్, నాల్లురి విష్ణుమూర్తి, సింగరయ్య, పాల్గొన్నారు.

## నారావారిపల్లిలో గో-ఆధార్ మజిల్ క్యాప్చర్



**చంద్రగిరి, జనవరి 2 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వగ్రామం నారావారిపల్లిలో గురువారం డిఏహెచ్‌ఓ డాక్టర్ ఎ.రవికుమార్, డిడి డాక్టర్ ఉమామహేశ్వరి ప్రాథమికంగా "గో-ఆధార్ మజిల్ క్యాప్చర్" పైలెట్ ప్రాజెక్టను ప్రారంభించారు. పలువురు రైతులు తమ పాడి ఆవులకు వైద్య పరీక్షలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఎడి డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, వెటర్నరీ సర్జన్ డాక్టర్ కె.వంశీ, తదితరులు పాల్గొన్నారు.

## ఏ.రంగంపేటలో...మినీ గోకులం

-నేడు ఎంఎల్ఏ పులివర్తి నాని భూమిపూజ

**చంద్రగిరి, జనవరి 2 ప్రభాతవార్త:** పాడిరైతుల సౌకర్యార్థం ఆరేపల్లి రంగంపేటలో శుక్రవారం మినీ గోకులం నిర్మాణానికి ఎంఎల్ఏ పులివర్తి నాని భూమిపూజ చేయనున్నట్లు ఎంపిడిఓ శేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఎంఎల్ఏ ఉదయం 9 గంటలకు ఏ.రంగంపేట చేరుకుని భూమిపూజ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అనంతరం 10 గంటలకు నారావారిపల్లిలో నిర్వహించ తలపెట్టిన జాబ్‌మేళా కార్యక్రమంలో పాల్గొంటారని అన్నారు.

## శ్రీకాళహస్తిలో దక్షిణామూర్తికి షోడశాభిషేకాలు



**శ్రీకాళహస్తి,జనవరి 2 ప్రభాతవార్త :** దివ్యక్షేత్రం శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన దక్షిణామూర్తి క్షేత్రపా లకు దుగా విరాలజిల్లుతున్నారు.గురువారం షోడశాభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద భక్తులు వరుస కట్టారు. ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ పర్యవేక్షణలో దీక్షా గురుకుల్ నిరంజన్ గురుకుల్ గురుదక్షిణామూర్తి ఆలయం ఎదుట కలశస్థాపన గావించారు. తరువాత స్వామికి హోమాలు నిర్వహించారు. అనంతరం పాలు,పెరుగు, పంచామృతం, చందనం, పసుపు,తేనె, నారికేళ్ళ జలంతో అభిషేకాలు జరిపారు. ఎఇఓ లోకేష్‌రెడ్డి, టెంపుల్ ఇన్సెపెక్టర్ హరియాదవ్, సుదర్శనం,సూపరింటెండెంట్ నాగభూషణం స్థానిక భక్తులు విశేష సంఖ్య హాజరైనారు.

## గొబ్బెమ్మ గ్రామోత్సవం



**శ్రీకాళహస్తి,జనవరి 2 ప్రభాతవార్త :** ధనుర్మాసం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరా లయంలో వెలసిన దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారు గౌరమ్మగా గొబ్బెమ్మగా పుర ప్రజల దర్శనం కోసం గురువారం గ్రామోత్సవానికి నిర్వహించారు. అమ్మవారిని చక్కగా పుష్పాలంకారం జరిపారు. గ్రామోత్సవంతో పాటు టెంపుల్ ఇన్సెపెక్టర్ సుదర్శనం నాయుడు, దఫేదారులు, భద్రయ్య, సురేష్,రజనీ శేఖర్ సిబ్బంది వెంటరాగా ఉత్సవం నాల్గుమాడావీధుల్లో సాగింది.

## దొంగపెన్షన్లపై సమగ్ర విచారణ జరపాలి : తాటిపర్తి ఈశ్వర్‌రెడ్డి



**శ్రీకాళహస్తిరూరల్,జనవరి 2 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తి మండలం ఎంపేడు పంచాయతీల్లో ప్రభుత్వం అందిస్తున్న సామాజిక పెన్షన్లకు సంబంధించి సమగ్ర విచారణ జరపాలని మాజీ మండల ఉపాధ్యక్షుడు తాటిపర్తి ఈశ్వర్‌రెడ్డి డిమాండ్ చేసారు.ఈ అంశాన్ని తాను గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సుల్లోనూ, స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డికి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. గురువారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ గత వైకాపా పాలనలో అర్హత లేని వారికి తమ ఇష్టమొచ్చినట్లు పెన్షన్లను అందించారని కానీ నిజంగా అర్హత ఉండి పెన్షన్లు తీసుకోవాటానికి అన్ని అర్హతలున్న వారిని నిర్లక్ష్యం చేసారని ఆరోపించారు. నియోజకవర్గంలో ఇలాంటి పెన్షన్లు కొల్లలుగా ఉన్నాయ నటానికి తన పంచాయతీలోని నకిలి పెన్షన్లే నిదర్శనం అన్నారు. ఎంపేడు పంచాయతీలో సుమారు 75 పెన్షన్లు ఉన్నాయని వివరించారు. నియోజకవర్గంలో అనర్హుల పెన్షన్లకు సంబంధించి సమగ్ర విచారణ జరపాలని ఈశ్వర్‌రెడ్డి డిమాండ్ చేసారు.

## డంపింగ్ యార్డు స్థలాన్ని పరిశీలించిన ఆర్డీవో



**వడమాలపేట, జనవరి 2 ప్రభాతవార్త:** మండలంలోని ఎస్‌బీఆర్ పురంలో ఇటీవల డంపింగ్ యార్డు కోసం కేటాయించిన స్థలాన్ని తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ పరిశీలించారు. డంపింగ్‌యార్డు విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం డంపింగ్‌యార్డుకు కేటాయించిన పోరంబోకు భూమికి సంబంధించిన రికార్డులకు పరిశీలించారు. గ్రామంలో ప్రధాన సమస్యగా ఉన్న గూళూరు చెరువు ఇబ్బందులు స్థానికులు విన్నవించారు. పాత ఎస్టీ కాలనీలో 100 కుటుంబాలు ఉన్నాయని శ్మశనానికి స్థలం కేటాయించాలని కాలనీ వాసులు కోరారు. పరిశీలనలో తహసీల్దార్ జరీనా, డీటీ సుధీర్, ఆర్ఐ జానీ బాషా, సర్పంచ్ మణిరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## భోజనానికి ప్లేట్లు వితరణ



సూళ్లూరుపేట, జనవరి 2 ప్రభాతవార్త : రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకానికి ప్లేట్లు, గ్లాసులను ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగా ప్రసాద్ వితరణతో గురువారం అందజేశారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చొరవతో ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్యామ్‌కుమార్, పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ అడగగా కళాశాలకు మధ్యాహ్న భోజన సామగ్రిని అందజేసిన గంగాప్రసాద్‌కు జూనియర్ కళాశాల తరపున ప్రిన్సిపాల్ శ్యామ్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు.

## విన్నమాలలో ఘర్షణ... ఇద్దరుకి తీవ్రగాయాలు!

నాయుడుపేట, జనవరి 2 ప్రభాతవార్త : నాయుడుపేట మండలంలోని విన్నమాల గ్రామానికి చెందిన బత్తినేని శ్రీకాంత్ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన కలపాటి మోహన్‌కృష్ణపై కర్రతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. విషయం తెలుసుకొన్న మోహన్‌కృష్ణ అన్నదమ్ములు స్నేహితులు శివ,మస్తాన్ కలిసి శ్రీకాంత్‌పై కర్రలతో ప్రతిదాడిచేసి కాలుకు తీవ్రంగా గాయపరిచాడు.దాడిలో తీవ్రంగా గాయపడిన మోహన్‌కృష్ణ,శ్రీకాంత్‌లను కుటుంబ సభ్యులు నాయుడు పేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వారిలో బత్తినేని శ్రీకాంత్ పరిస్థితి విషమంగా ఉంటడంతో మెరుగైన వైద్యంకోసం నెల్లూరుకు తరలించారు. నాయుడుపేట సిఐ బాబి ఇరువురిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

## అయ్యప్పస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు



సూళ్లూరుపేట, జనవరి 2 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలోని శ్రీఅయ్యప్పస్వామి దేవ స్థానంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం సాయంత్రం నుంచి మాజీ టిటిడి బోర్డు సభ్యులు వేనాటి రామచంద్రారెడ్డి ఆధ్వ ర్యంలో ఈ పూజలు జరిగాయి. బుధవారం రాత్రి కేంద్ర హౌసింగ్ బోర్డు ఛైర్మన్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎంపి నెలవల సుబ్రహ్మణ్యం దంపతులు అయ్యప్పస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

## వృద్ధురాలిపై అత్యాచారయత్నం :కేసు నమోదు

తడ, జనవరి 2 ప్రభాతవార్త : తడ గుమ్మిడిపూండి కాలనీలో సుమారు 57 ఏళ్ల వయస్సు ఉన్న వృద్ధురాలిపై ఒక యువకుడు అత్యాచారయత్నం చేసినట్లు తడ పోలీసులు కేసు నమోదు చేశారు. తడకండ్రిగకు చెందిన ఎం.కుమార్‌పై ఆ వృద్ధురాలు ఒంటరిగా ఉన్న సమయాన ఇంట్లోకి ప్రవేశించి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. సమీప ఇళ్లలోని వారు వచ్చి రక్షించారని ఫిర్యాదు చేసి ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే



వెంకటగిరి, జనవరి 2 ప్రభాతవార్త : పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. ఆరు మందికి 7లక్షల 56 వేల రూపాయల సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆసుపత్రులలో చికిత్స పొంది డబ్బులు ఖర్చుకు ఇబ్బంది పడుతున్న పేదల కోసం సీఎం సహాయ నిధి పథకం ఎంతగానో ఉపయోగ పడుతున్నట్లు తెలిపారు. పేదల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు నాయుడు ఎంతగానో కృషి చేస్తున్నట్లు తెలిపారు. టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోండి:సబ్ కలెక్టర్




వాకాడు, జనవరి 2 ప్రభాతవార్త : రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని రాఘవేంద్ర మీనా రైతులను కోరారు. వాకాడు మండలం తిరుమూరు గ్రామంలోని రెవెన్యూ ఉత్తర పొలంలోని సర్పంచ్ లక్ష్మి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా మాట్లాడుతూ తిరుమూరు పంచాయతీ రెవెన్యూ ఉత్తర పొలం గ్రామంలోని ఉన్నటువంటి భూముల వివరాలను తాసిల్దార్ రామయ్య, మండల సర్వేయర్ శకుంతల ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నాడు, భూ సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రైతు లను ఉద్దేశించి సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టా త్మకంగా ప్రవేశపెట్టిన రెవిన్యూ సదస్సును రైతులందరూ ఉపయోగించుకోవాలని కోరారు. భూ సమస్యలు ఎలాంటి ఉన్న రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. తహశీల్దార్ రామయ్య మాట్లాడుతూ తిరుమూరు పంచాయతీలోని ఉన్నటువంటి భూ సమస్యలు తన దృష్టికి తీసుకురావాలని, అదే విధంగా భూ సమస్యల మీద వచ్చినటువంటి అర్జీలను సత్వరమే పరిశీలించబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అన్నపూర్ణ రావు, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ అ ఖిల్ యాదవ్, టిడిపి నాయకుడు దయాకర్, షేక్ గౌస్ ముహుద్దీన్, వీఆర్వో హరిబాబు, పంచాయతీ కార్యదర్శి సురేష్, వివిధ శాఖల సిబ్బంది, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి రూరల్ మండల అధ్యక్షుడుగా గాలి ప్రకాష్



గూడూరు, జనవరి 2 ప్రభాతవార్త : భారతీయ జనతా పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోటుపాలెంలో గూడూరు రూరల్ మండలం ఎన్నికల రిటర్నింట్ అధికారి పి.బైరప్ప, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి వేమారెడ్డి సురేంద్ర నాథ్ రెడ్డి మండల అధ్యక్షుడు సంస్థాగత ఎన్నిక నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ నాయకులు పోలింగ్ బూత్ అధ్యక్షులు, క్రియాశీలక సభ్యులు సమావేశమై పార్టీలో గత కొన్ని పర్యాయాలుగా జిల్లా, రాష్ట్ర కిసాన్ విభాగంలో వివిధ బాధ్యతలు నిర్వహించిన గాలి ప్రకాష్‌నాయుడుని గూడూరు వెస్ట్ గూడూరు రూరల్ మండలం అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## క్రీడల ద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు : ఎమ్మెల్యే



గూడూరు, జనవరి 2 ప్రభాతవార్త : గూడూరు పాలిటెక్నిక్ కాలేజ్ ఇండియా లోనే మైనింగ్ కాలేజీల్లో నాలుగో స్థానంలో ఉండడం సంతోషంగా ఉందని క్రీడల ద్వారా కూడా ఉన్నత స్థాయికి ఎదగవచ్చని గెలుపు, ఓటమి సహజమని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో 27వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మేట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. విద్యార్థుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడూరు పాలిటెక్నిక్ కాలేజ్ ఇండియాలోని మైనింగ్ కాలేజీల్లో గుర్తింపు పొందడం సంతోషంగా ఉందని గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఈ కాలేజీకి వచ్చే రోడ్డు అధ్వానంగా ఉందని కొత్త రోడ్డు వేయించామని గుర్తు చేశారు. అనంతరం జరిగిన రన్నింగ్ పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ కుమార్ ప్రియా, రవికృష్ణ,వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్, పిల్లు చెంచు రామయ్య, వెంకటేష్, ముమ్మడి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో తల్లిదండ్రులు భాగస్వామ్యం కావాలి




కోట, జనవరి 2 ప్రభాతవార్త: పాఠశాలల అభివృద్ధి విషయంలో స్కూలు మేనేజ్‌మెంట్ సభ్యులు, తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని ఎంఇఓ మస్తానయ్య కోరారు. గురువారం కోటలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 40మంది కమిటీ సభ్యులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎంఇఓ మాట్లాడుతూ కమిటీ సభ్యుల బాధ్యతలు, హక్కులను వివరించారు. తల్లిదండ్రు లు ఆయా పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన పథకాన్ని నాణ్యతను పరిశీలించవచ్చని తెలిపారు. నాడు-నేడు కింద జరుగుతున్న పనులు పర్యవేక్షించే బాధ్యత కూడా ఉందన్నారు. ప్రతి నెలా తమ బిడ్డలు సక్రమంగా పాఠశాలలకు వెళుతున్నారా, ఉపాధ్యాయులు సక్రమంగా చెప్తున్నారా అనే విషయాలపై కూడా ఆరా తీసే హక్కు మేనేజిమెంట్ కమిటీ సభ్యులకు ఉందన్నారు. పాఠశాల అభివృద్ధి విషయంలో తల్లిదండ్రులు చొరవ చూపాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులుగా కృష్ణయ్య, రిసోర్సు పర్సన్లుగా నాగయ్య, సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఫైనల్స్‌కు రోటరీ అంతర్ పాఠశాలల క్రికెట్ జట్లు



గూడూరు, జనవరి 2 ప్రభాతవార్త : రోటరీ అంతర్ పాఠశాలల క్రికెట్ టోర్నమెంట్ 2024 రోటరీ క్లబ్, గూడూరు క్రికెట్ క్లబ్, అల్లూరి ఆదిశేషారెడ్డి క్రికెట్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో నిర్వహిస్తున్న అంతర్ పాఠశాలల క్రికెట్ పోటీలలో గురువారం జరిగిన క్రికెట్ సెమి ఫైనల్స్ మ్యాచ్‌లలో శ్రీ చైతన్య, ఎల్.ఏ.పీ జట్లు గెలుపొంది ఫైనల్స్ కు చేరుకున్నాయి. రెండు సెమి ఫైనల్స్ మ్యాచ్‌లలో మొదటి మ్యాచ్ శ్రీచైతన్య/ ప్రాస్పరో జట్లు మధ్య సాగింది. శ్రీచైతన్య టాస్ గెలిచి ఫస్ట్ బ్యాటింగ్ చేపట్టిన శ్రీ చైతన్య 15 ఓవర్లలో 139/4 సాధించింది. జాన్ బెన్యాన్ 44 రన్స్ (40 బాల్స్) సాధించాడు. ప్రాస్పరో 15 ఓవర్‌లలో 126/3 రన్స్ సాధించింది. పూర్ణ యశ్వంత్ రెడ్డి 92 రన్స్ (62 బాల్స్) సాధించాడు. శ్రీ చైతన్య 13 రన్స్‌తో గెలుపొందింది. సెమీ ఫైనల్ 2లో 2న్డ్ మ్యాచ్ ఎల్ ఏ పీ /గూడూరు జడ్.పి స్కూల్ జట్లు మధ్య జరిగింది. ఎల్.ఏ.పీ టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టి 15 ఓవర్లు లో 138/2 మహిర్ (64రన్స్ (45 బాల్స్) ధార్మిక 40 రన్స్ (28 బాల్స్)సాధించారు. గూడూరు జడ్ పి 68/8, 15 ఓవర్లులో 68/8 రన్స్ సాధించింది. ఎల్ ఏ పీ 70 రన్స్‌తో గెలుపొందింది. ఈ రెండు సెమి ఫైనల్స్‌లో విజేతలుగా గెలుపొందిన శ్రీ చైతన్య, ఎల్.ఏ.పీ స్కూల్ జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయి.

## లక్ష్మక్కకండ్రిగలో రెవెన్యూ సదస్సు

కోట, జనవరి 2 ప్రభాతవార్త : కోట మండలం లక్ష్మక్కకండ్రిగ గ్రామంలో గురువారం తహశీల్దార్ కె.జయజయరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూపరంగా భూ సమస్యలు ఉంటే ఈ సదస్సులలో అర్జీల రూపంలో ప్రజలు అందజేస్తే 45 రోజుల్లోగా పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ అజ్మతుల్లా ఖాన్, సర్వేయర్ గోపిరెడ్డి, ఆర్ఐ మధులత తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని మృతదేహం!

దొరవారిసత్రం, జనవరి 2 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలం నెలబల్లి గ్రామ సమీపంలో రైల్వే ట్రాకు మీద గుర్తుతెలియని మృతదేహంను కనుగొన్నారు. దొరవారిసత్రం, నాయుడుపేట రైల్వే స్టేషన్‌ల మధ్య నెలబల్లి గ్రామ సమీపంలో గల ఆంజనేయస్వామిగుడి వెనకాల దిగువ రైలు మార్గంలో సుమారు 40 సంవత్సరాల వయసు గల గుర్తు తెలియని మగ వ్యక్తి, గుర్తు తెలియని రైలు నుండి ప్రమాదవశాత్తు జారిపడి చనిపోయినట్లు రైల్వే పోలీసుల సమాచారం. సూళ్లూరుపేట జీఆర్‌పిఓపి ఎస్.ఐ చెన్నకేశవ మాట్లాడుతూ చనిపోయిన వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. మృతుడు గడ్డం పెంచుకుని ఉన్నాడు,ఫింకు రంగు షర్ట్, తెలుపు రంగు జీను ఫెంటు ధరించి ఉన్నట్టు చెప్పారు. మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తునట్టు తెలియజేశారు.

## 11 నుండి వికేర్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు

బాలాయపల్లి, జనవరి 2 ప్రభాతవార్త : యువత అందరూ సంతోషంగా ఉండేందుకు ఈనెల 11వ తేదీ నుండి 19వ తేదీ వరకు జయంపు గ్రామంలో వికేఆర్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు మాజీ సొసైటీ అధ్యక్షులు, నిర్వాహకులు వెందోటి కార్తీక్‌రెడ్డి తెలిపారు. మొదటి బహుమతి పదివేల 16 రూపాయలు, రెండో బహుమతి 5016 రూపాయలు విజేతలకు అందజేస్తామని తెలిపారు. 516 రూపాయలు ఎంట్రీ ఫీజు ఉంటుందని చెప్పారు.

## జోనల్ క్రీడలలో బీసీ వెల్ఫేర్ విద్యార్థినుల ప్రతిభ



తిరుపతి విద్య, జనవరి 2 ప్రభాతవార్త: స్థానిక జూపార్కు రోడ్డులోని మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులు జోనల్ స్థాయి క్రీడా పోటీలలో ప్రతిభ కనబరచి చాంపియన్స్‌గా నిలిచారు. పాఠశాల ప్రిన్సిపల్‌కే రేష్మా మాట్లాడుతూ అనంతపురం జిల్లా బీసీ వెల్ఫేర్ పాఠశాల వేదికగా జరిగిన జోనల్ క్రీడా పోటీలలో ఉదయమాణిక్యం మహాత్మ జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ బాలికలు పాఠశాల విద్యార్థినులు పలు రకాల క్రీడా పోటీలలో అద్భుతమైన ప్రతిభ కనబరచడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాల ఆవరణలో ప్రతిభ చూపి ఛాంపియన్స్ గా నిలిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.ఈ కార్యక్రమంలో పీఈటీ విమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బిజెపిచే హైందవ శంఖారావం భారీ ర్యాలీ



శ్రీకాళహస్తి,జనవరి 2 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలో గురువారం భారతీయ జనతాపార్టీ సారధ్యంలో భారీ ర్యాలి నిర్వహించారు. ఈ నెల 5న జరుగు హైందవ శంఖారావం చైతన్య ర్యాలీని బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ కుమార్ సారధ్యంలో నిర్వహించారు. ర్యాలి పట్టణ నడిబొడ్డులోని బేరివారి మండపం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ బజారువీధి,తేరువీధి, నగరివీధి, నెహ్రూవీధుల మీదుగా సాగింది. హిందూ దేవాలయాలను కాపాడాలని ప్రత్యేక చట్టం తీసుకురావాలని నినాదాలు చేస్తూ ర్యాలీ సాగింది, ర్యాలీలో బిజెపి నాయకులు సుబ్రమణ్యంరెడ్డి, గోపాల్,ఎస్‌వి రమణ,గరికపాటి రమేష్, కూనాటి నాగరాజు, గోపాల్, పుల్లయ్యనాయుడు, ధర్మయ్య యాదవ్, వేదం కృష్ణయ్య,ఆర్.హరీష్‌రెడ్డి, వెంకటేష్, తిరుమలశెట్టి నరేష్, ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన సొట్ట కుమార్, పి.సుబ్రమణ్యంరెడ్డి, జివి అమర్‌నాధ్, అయ్యప్ప, ఢిల్లి కుమార్,ఎస్ అబ్దుల్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాలినడకన భక్తితో నటి రాశిసింగ్



భక్తితో శ్రీవారి మెట్టుమార్గంలో గురువారం సాయంత్రం సినీనటి రాశీసింగ్ కాలినడకన తిరుమలకు చేరుకుంది. ఆమె నుదుటిన తిరుమానం ధరించి నడకమార్గంలో తోటిభక్తులతో కలసి సామాన్య భక్తురాలిగానే రావడం జరిగింది. నేటి ఉదయం ఆమె స్వామివారిని దర్శించుకోనుంది.

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల

## తాగివాహనాల నడిపితే ప్రమాదం: డివైయస్‌పి



శ్రీకాళహస్తి,జనవరి 2 ప్రభాతవార్త : తాగి వాహనాలు నడిపి ఏదైనా ప్రమాదం జరిగితే మీరు బాధ పడేదే కాకుండా కుటుంబం ఎంత మానసిక వేదనను ఎదుర్కొవాల్సి వస్తుందో ఒక సారి ఆలోచిం చాలని శ్రీకాళహస్తి డివైయస్‌పి నరసింహామూర్తి అన్నారు. డిసెంబర్ 31 రాత్రి మద్యం సేవించి వాహనాలను నడిపిన 47 మందిని గురువారం శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీసు స్టేషన్లో చైతన్యం కల్గించారు. వీరిలో 35 టౌన్ టూటౌన్‌లో7,రూరల్ 3, బుచ్చినాయుడు కండ్రిగలో 2 మందిని అదుపులో తీసుకొని వారి వాహనాలను సీజ్ చేసారు.వారిని గురువారం ఒక్కొక్క స్టేషన్లో చైతన్య సదస్సులను నిర్వహించారు. మద్యం సేవించి వాహనం నడిపిన వారితో పాటు వారి తల్లిదండ్రులను కూడా పోలీసు స్టేషన్లకు పిలిపించారు. మొదట తల్లిదండ్రులను బిడ్డలకు అతి గారాబం చేయరాదని సూచించారు. బిడ్డలపై ప్రేమానురాగాలు ఉండాల్సిందే కానీ అతి గారాబం మొదటికి మోసం వస్తుందని హితవు చెప్పారు. ఇక వాహనాలు నడిపిన వారిని మందలిస్తూ మంచి భవిష్యత్తు ఉన్న మీరు ఇలా వ్యవహరించటంతో సమాజంలో చెడ్డ పేరు కొని తెచ్చుకుంటారన్నారు. ఈ చైతన్య సదస్సుల్లో సిఐలు డి.గోపి,టూటౌన్ సిఐ వెంకటేశ్వర్లు, టౌన్ ఎస్ఐ సుదాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో కొండెక్కారు

### -రెండు వాహనాలు శాశ్వతంగా నిషేధం



తిరుమల,జనవరి 2ప్రభాతవార్తప్రతినిధి: మద్యం సేవించి వాహనాలను తిరుమలకు నడిపిన ఇద్దరు వాహనాల డ్రైవర్లపై కేసు నమోదు చేసి, ఆ రెండు వాహనాలను ఇకపై శాశ్వతంగా తిరుమలకు నిషిధించినట్లు తిరుమల ట్రాఫిక్ సిఐ హరిప్రసాద్ తెలిపారు. జిఎన్‌సి టోల్‌గేట్‌లో తనిఖీల్లో ఈ విషయం బయటపడటంతో ఇద్దరు డ్రైవర్లు పై కేసు నమోదైంది.

## శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



తిరుపతి(రవాణ),జనవరి 2ప్రభాతవార్త : వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో గురువారం శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్‌తిరుమంజనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఏపి శ్రీనివాసదీక్షితులు, ఆలయ ఎఇఒ మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ చిరంజీవి, ఆలయ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

## ప్రాణదానట్రస్ట్‌కు గిరధర్ భారీ విరాళం



తిరుమల,జనవరి 2ప్రభాతవార్తప్రతినిధి: ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు టిటిడి మాజీ ఛైర్మన్ పిఎస్ కుప్పాల గిరిధర్‌కుమార్ 10లక్షలు రూపాయలు విరాళాన్ని అందించారు. గురువారం ఉదయం ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యాచౌదరికి అందజేశారు.

## శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటి పగ్గాలు ఎవరికో!




శ్రీకాళహస్తి,జనవరి 2 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రస్తుతం నామినేటెడ్ పదవుల పరుగు సాగుతుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యవసాయమార్కెట్ కమిటి పాలకమండళ్ళను సంక్రాంతికి నామినేట్ చేస్తామని ప్రకటించటంతో ఆశావహుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అయితే శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ పగ్గాలను శ్రీకాళహస్తి మండలం మన్నవరానికి చెందిన రంగినేని చెంచయ్యానాయుడు పేరును శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి పేరును ఖరారు చేసుకున్నట్లు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. మరి మార్కెట్ కమిటి చైర్మెన్ పగ్గాలు ఎవరికి అందిస్తారో వేచి చూడాలి.

**మార్కెట్ కమిటి పదవుల కోసం, రెండు మండలాల నాయకుల ఆశలు:**

శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి పగ్గాలను శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఎవరికి అవకాశం కల్పిస్తారో ఏమో కానీ రెండు మండలాల నాయకులు ఆశిస్తున్నారు. శ్రీకాళహస్తి మండల నాయకునికి అవకాశం కల్పించనున్నట్లు సమాచారం. ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తి మండలానికి చెందిన సీనియర్ నాయకుడు తాటిపర్తి ఈశ్వరరెడ్డి ఆశిస్తున్నట్లు, ఆయన వయస్సు దృష్ట్యా అవకాశం కల్పించాలని కొందరు నాయకులు కోరుతున్నారు. ఇక శ్రీకాళహస్తి మండల పార్టీ అధ్యక్షుడు కామేష్ యాదవ్, పార్టీ కష్టకాలంలో బొజ్జల కుటుంబానికి తోడుగా అండగా ఉండగా, ప్రస్తుతం పార్టీ నామినేటెడ్ పదవుల్లో తనకు అవకాశం కల్పిస్తారని భావిస్తున్నారు. ఇక మరో యువకుడు డాక్టర్ కృష్ణయాదవ్, ఇక ఏర్పేడు మండలంలోని అంజిమేడుకు చెందిన మాజీ సీడ్స్ డైరెక్టర్ శివశంకర్‌రెడ్డి ఆశిస్తున్నట్లు వినబడుతుంది. శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటి పగ్గాలను మండలాలకు చెందిన వారికి అప్పగించటం ఆనవాయితి. గతంలో ప్రస్తుత శాసనసభ్యుడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి హాయాంలో దాదాపు శ్రీకాళహస్తి మండలంలోని నాయకునికే అప్పగించే వారు. అదే సంప్రదాయాన్ని కాంగ్రెస్ హయాంలో ఎస్‌సివి నాయుడు శాసన సభ్యుడుగా శ్రీకాళహస్తి మండలానికి చెందిన సీనియర్ నాయకునికే అప్పగించారు.వారి హయాంలో మార్కెటింగ్ కమిటి ఎన్నో అభివృద్ది కార్యక్రమాలను చేపట్టారు.మరి ఈ సారి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మార్కెటింగ్ కమిటి కుర్చీపై ఎవరిని కూర్చొబెడతారో వేచి చూడాలి.

## ప్రతిచిన్న సమస్యలను కూడా పరిష్కరించుకోవచ్చు

### -జాయింట్ కలెక్టర్



తొట్టంబేడు, జనవరి 2 ప్రభాతవార్త : ప్రతి చిన్న సమస్యలను కూడా రెవెన్యూ సదస్సుల్లో పరిష్కరించుకోవచ్చని తిరుపతి జిల్లా జాయింట్‌కలెక్టర్ శుభంబన్సల్ తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో భాగంగా తొట్టంబేడు మండలంలోని పెద్దకన పర్తిలో ఏర్పాటు చేసిన సభకు జెసి శుభంబన్సల్, మరియు శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డిలు హజరయ్యారు. వీరికి తహశీల్దార్ మధుసూధనరావు స్వాగతం పలికారు. రెవెన్యూ సదస్సులను ఉద్దేశించి జాయింట్‌కలెక్టర్ శుభం బన్సల్ మాట్లాడుతూ ఈ సదస్సులు అన్నదాతలకు ఎంతో ఉపయోగ పడుతాయని ముఖ్యంగా అన్నదాతలు తమ భూసమస్యలను పరిష్కరించు కునేందుకు ఈసదస్సులు చక్కని ఉపయోగపడుతాయన్నారు. భూసమస్యలే కాకుండా గ్రామంలో ఉన్న చిన్నపాటి సమస్యలను కూడా పరిష్కరించు కోవచ్చన్నారు. గ్రామానికి చెందిన జనార్ధన్‌రెడ్డికి సంబంధించి 30 సంవత్సరాల భూ సమస్యలను జాయింట్ కలెక్టర్ పరిష్కరించారు. అనంతరం గ్రామంలో కాలువ పూడ్చివేత సమస్యను పరిష్కరించడంతో పాటు రెవెన్యూ సదస్సుల్లో ఇచ్చిన ప్రతి సమస్యను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తామన్నారు. కార్యక్రమానికి తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు గాలిమురళీ నాయుడు కూడా హజరయ్యారు. ఈసందర్భంగా జాయింట్‌కలెక్టర్‌కు పలు సమస్యలను తెలిపారు. అన్నదాతలకు సంబందించి మ్యుటేషన్లు పెండింగ్‌లో ఉన్నాయని, రైతులు సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలియజేయడంతో పాటు కనపర్తిరోడ్డును ఆధునికీకరించాలని తెలిపారు. అనంతరం గ్రామంలో ఉన్న సమస్యలను జెసి స్వయంగా వెళ్ళి పరిశీలించి పరిష్కరించడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం రౌతుసూరమాల గ్రామంలో ఏపిఐఐసి భూములను పరిశీలించారు. కాగా పరిశ్రమల వద్ద పట్టాభూములను పరిశీలించారు. ఆరులేన్ల రోడ్డు పనులను పరిశీలించిన అనంతరం గ్రామాలు ఎక్కడెక్కడ ఉన్నాయో బోర్డులు ఏర్పాటు చేయాలని సంబందిత సిబ్బందికి సూచించారు. అనంతరం మండల తెదేపా అధ్యక్షుడు మురళీనాయుడు జెసి శుభంబన్సల్, ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డిలను దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం కంచనపల్లిలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ మధుసూధనరావుతో పాటు సీనియర్ అసిస్టెంట్ నారాయణస్వామి,విఆర్‌ఓలు కృష్ణమూర్తి, సంధ్య, కమ్యూనిటీ సర్వేయర్ సత్యనారాయణ, కంప్యూటర్ ఆపరేటర్ సురేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మెప్మా కార్యాలయంలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయండి

### - మహిళా మార్ట్ లిఫ్ట్ మరమ్మతులు చేపట్టండి - అధికారులను ఆదేశించిన కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, జనవరి 2 ప్రభాతవార్త : నగరంలోని మహిళలకు అండగా ఉన్న పట్టణ పేదరిక నిర్మూలన కేంద్రం (మెప్మా) లో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయం సమీపంలో గల మెప్మా కార్యాల యం, అగ్నిమాపక కేంద్రం, కృష్ణాపురం ఠాణా వద్ద గల మహిళా మార్ట్ ను గురువారం మధ్యాహ్నం కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెప్మా కార్యాలయం వద్ద అపరిశుభ్రత, మహిళా మార్ట్ వద్ద లిఫ్ట్ మరమ్మత్తులు చేయకపోవడం పట్ల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మెప్మా కార్యాలయంకు పెద్ద సంఖ్యలో మహిళలు వస్తుంటారని, వారికి మౌలిక వసతులు కల్పించాలని కోరారని అన్నారు. ఈ మేరకు తనిఖీ చేశామని అన్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించామన్నారు. లిఫ్ట్ ను పరిశీలించాలని, త్వరగా మరమ్మత్తులు చేయించాలని అధికారులను ఆదేశించామని అన్నారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, డి.ఈ. మధు, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి, సూపరింటెండెంట్ సుధాకర్, శ్రీనాథ్ రెడ్డి, సిఎంఎం కృష్ణవేణి, తదితరులు ఉన్నారు.

## శంఖారావానికి రూ.2.5 లక్షల విరాళం



పుంగనూరు, జనవరి 2 ప్రభాతవార్త: ఈ నెల 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావానికి ఎన్వీఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు వేణుగోపాల్ రెడ్డి, ఉషశ్రీ దంపతులు తమవంతు సహాయంగా రూ.2,50,000 అందించారు. పుంగనూరు నియోజకవర్గంలో నుంచి బయలుదేరే పలు వాహన సౌకర్యం కొరకు గతంలో స్థానిక విశ్వహిందూ పరిషత్ వేణుగోపాల్ రెడ్డిని సంప్రదించారు. ఆరోజు ఇచ్చిన మాట మేరకు గురువారం తన నివాసంలో వేణుగోపాల్‌రెడ్డి ఉషశ్రీ దంపతులు హైందవ శంఖారావానికి ప్రయాణార్థం విశ్వహిందూ పరిషత్ కు 2,50,000 అందించారు. పుంగనూరు విశ్వహిందూ పరిషత్ తరపున మరియు హిందూ జాగరణ సమితి తరపున వేణుగోపాల్‌రెడ్డికి త్రిమూర్తిరెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్వీఆర్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి శివకుమార్ రెడ్డి, నరేందర్ రెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.